హెచ్చరిక!

వసుంధర

కిల్లర్ మొబైల్ వ్యాన్ థియేటర్ ముందాగింది. [illegible] సీట్లోంచి దిగి బుకింగ్ కౌంటర్ వైపు [illegible] [illegible] నడిచాడు డిటెక్టివ్ కిల్లర్ [illegible] ాలికలు తిరిగిఉంది.

పురుషుల క్యూ చాలా పొడుగ్గా [illegible]

స్త్రీల క్యూ చాలా చిన్నదిగా ఉంది.

"టికెట్లు దొరకవు—" అనుకున్నాడు కిల్లర్.

సరిగ్గా అప్పుడే ఒక యువతి అతడి పక్కకు వచ్చి చనువుగా చేయి పట్టుకుని—"టికెట్లు తీశాను. పదండి-పోదాం!" అంది.

కిల్లర్ తెల్లబోయి ఆమెవంక చూశాడు.

ఆమె కళ్ళలో అట్టే మాట్లాడవద్దన్న హెచ్చరిక ఉంది.

కిల్లర్ ఆ హెచ్చరికను పాటించి ఆమెతో థియేటర్లోకి వెళ్ళి కూర్చున్నాడు.

"మీరెవరో నాకు తెలియదు. గత్యంతరంలేక చనువు

తీసుకున్నాను. నన్ను మన్నించండి—" అందా యువతి కమ్మగా.

"మరి కాస్త వివరంగా చెప్పు—" అన్నాడు కిల్లర్.

"నా పేరు చేతన. నన్నో వ్యక్తి వెంటాడుతున్నాడు" అందామె.

"ఎందుకు?"

"అతడికి నే నేదో పని చేసి పెట్టాలిట?"

"ఏమిటా పని?"

"అతడు నాకో బ్రీఫ్ కేసు ఇస్తాడట. అది నేను తను చెప్పినచోట అందజేయాలిట...."

"అందులో తప్పేముంది?"

"అది స్మగ్లింగుకు సంబంధించిన వ్యవహారం...."

"ఎలా తెలుసు?"

ఆ యువతి మాట్లాడలేదు....

"ఎలా తెలుసు?" అడిగాడు కిల్లర్.

"చెప్పలేను—" ... కిల్లర్.

"మిస్ ... అందామె.

చేతనా! అతడు నిన్నెందుకు వెంటాడుతున్నాడు?"

"అంటే?"

"స్మగ్లింగ్ కు నువ్వు తప్ప ఎవ్వరూ దొరకలేదా వాళ్ళకి!"

చేతన ఏదో చెప్పబోయింది. సరిగ్గా అప్పుడే బాయ్ కిల్లర్ ని సమీపించి — "సార్! ఆయన మిమ్మల్ని పిలుస్తున్నారు—" అన్నాడు.

కిల్లర్ అటువైపు చూశాడు. చేతన కూడా అటే చూసి ఖంగారుగా—"అతడే!" అంది.

"నా టికెట్ మార్చి లాగియ్యి—" అన్నాడు కిల్లర్.

ఆ ముక్క తీసుకుని జేబులో పెట్టుకొని అతడు లేచాడు.

గుమ్మం దగ్గర నిలబడి ఉన్నాడతడు.

“ఎవరున్నవ్వు? నన్నెందుకు పిలిచావు” అన్నాడు కిల్లర్.

“కాస్త బయటకురా — చెబుతాను....” అన్నాడతడు.

ఇద్దరూ కలసి కొద్ది అడుగులు నడిచారు.

“నువ్వు నా పిల్ల పక్కన కూర్చున్నావు—” అన్నాడతడు.

“నువ్వే పిల్ల గురించి మాట్లాడుతున్నావో నాకు తెలియదు. నేను నా భార్య పక్కన కూర్చున్నాను...” అన్నాడు కిల్లర్.

“అది నీ భార్యకాదు....”

కిల్లర్ సీరియస్‌గా — “నా భార్యను అదీ యిదీ అంటే సహించను—” అన్నాడు.

అతడు మౌనంగా జేబులోంచి ఓ కాగితంతీసి కిల్లర్‌కి అందించి—“ఒకసారి చూడు—” అన్నాడు.

అందులో ఒక యువకుడి బొమ్మ ఉంది. యువకుడి గుండెలో కత్తి దిగి ఉంది. రక్తం బొటా బొటా కారుతున్నట్లు చిత్రించబడి ఉంది.

“ఏమిటిది?”

“నీకిది హెచ్చరిక!”

కిల్లర్ నవ్వి—“థాంక్స్” అన్నాడు.

“అయాం సీరియస్—” అన్నాడతడు.

“ఇంతకీ ఎవరు నువ్వు?” అన్నాడు కిల్లర్.

“అయా మీ కిల్లర్!” అన్నాడతడు.

“అయితే నేనేం చేయాలి?”

"నీ జేబులోని టికెట్ ముక్క నాకిచ్చేసి వెళ్ళిపో—"

"ఇవ్వకపోతే?"

"ఏం జరుగుతుందో హెచ్చరించానుగా!"

కిల్లర్ కుడిచేతిలోని హెచ్చరిక కాగితాన్ని ఎడమ చేతిలోకి మార్చుకున్నాడు. కుడిచేతిని పాంటు జేబులోకి పోనిచ్చాడు.

అతణ్ని హెచ్చరించిన వ్యక్తి ఏం జరుగుతుందోనని చూస్తున్నాడు. తన బెదిరింపుకు కిల్లర్ భయపడి ఉంటాడని అతడనుకున్నాడు.

కిల్లర్ చేయి పాంటు జేబులోంచీ బయటకు వచ్చింది. చేతిలో త్రీ ఫైవ్స్ సిగరెట్ ప్యాకెట్ వుంది.

"డూయూ స్మోక్!" అన్నాడు కిల్లర్.

"నో!" అన్నాడతడు.

"నేనూ స్మోక్ చేయను. మిత్రులకు ఆఫర్ చేయడం కోసం ఎప్పుడూ జేబులో ఒక ప్యాకెట్టుంచుకుంటాను—" అని—"అన్నట్లు నువ్వు నాకు మిత్రుడివి కాదేమో?" అంటూ ప్యాకెట్ తిరిగి జేబులోకి తోసేశాడు.

"వేళాకోళంగా ఉందా?" అన్నాడతడు.

"అయాం సీరియస్—" అంటూ కిల్లర్ ఎడంచేతిలోని కాగితాన్ని కుడిచేతిలోనికి మార్చి అతడి కందించాడు.

"ఏమిటిది?" అన్నాడతడు.

"నీ హెచ్చరిక నీకే అందజేస్తున్నాను.." అన్నాడు కిల్లర్.

"అంటే?" అన్నాడతడు కోపంగా.

"నువ్వు నన్ను హెచ్చరించావు. అది మరిచిపోవడం నీకు మంచిది. మరిచిపోలేదు—ఇప్పుడు నీ దగ్గరున్నది

నా హెచ్చరిక అవుతుంది—" అన్నాడు కిల్లర్.

"నాతో తెలాకోళం మంచిది కాదు. గుర్తుంచుకో-అయామ్ మే కిల్లర్!" అన్నాడతడు గంభీరంగా.

"యూ ఆర్ కిల్లర్. బట్ అయాం కిల్లర్!" అంటూ కిల్లర్ వెనుతిరిగాడు.

2

కిల్లర్ థియేటర్లో ప్రవేశించేసరికి చేతన పక్కన ఓ యువకుడు కూర్చుని ఉన్నాడు.

"మిస్టర్! ఈ సీటు నాది...." అన్నాడు కిల్లర్.

"కావాలంటే సీట్లు ఎక్స్‌చేంజ్ చేసుకుందాం...." అన్నాడా యువకుడు.

"నేను కావాలనను. మర్యాదగా లే!" అన్నాడు కిల్లర్.

"చేతనా! మనం అక్కడే సీట్లు ఎక్స్‌చేంజ్ చేసుకుందాం. నాతో రా...." అన్నాడా యువకుడు.

చేతన మాట్లాడకుండా లేచి నిలబడింది.

కిల్లర్ చేతన వంక చూశాడు. ఆమె కళ్ళలో అతడికి అసహాయత కనబడింది. అతడు చటుక్కున చేయి పట్టుకుని చేతనను సీట్లో కూర్చోపెట్టి—ఆ యువకుడి వంక తీక్షణంగా చూసి—"గెటౌటాఫ్ హియర్—" అన్నాడు.

"చేతనా! నువ్వూ రా—" అన్నాడా యువకుడు.

కిల్లర్ ఆమె భుజాన్ని నొక్కిపట్టి—"చేతన రాదు" అన్నాడు.

ఆ యువకుడు కిల్లర్ కళ్ళలోకి చూసి లేచాడు.

అతడు వెళ్ళగానే కిల్లర్ చేతనతో—"ఏమిటి దంతా?" అన్నాడు.

చేతన నెమ్మదిగా—"నేనిప్పుడు చాలా పెద్ద ప్రమా

దంలో ఉన్నాను—" అంది.

"ఏమిటా ప్రమాదం?"

"ఒక పెద్ద గ్యాంగు నన్నుపయోగించుకోవాలని చూస్తోంది...."

"నిన్నెందుకు?" అన్నాడు కిల్లర్.

చేతన కిల్లర్ భుజంమీదకు వంగి—అతడి చెవిలో—"ప్లీజ్....దయుంచి ఇప్పుడు నన్నేమీ అడగొద్దు ఇక్కడేమీ చెప్పలేను...." అంది.

కిల్లర్ మాట్లాడకుండా ఊరుకున్నాడు.

చేతన కొద్దిక్షణాలాగి — "నేను వెళ్ళి వేరే సీట్లో కూర్చుంటాను—" అంది.

"ఎందుకు?"

"నా గురించి మీరు ప్రమాదంలో పడతారు...." అందామె.

"ఇప్పటికే నేను ప్రమాదంలో వున్నాను...."

"ఇప్పుడు నేను లేచి వెళ్ళిపోతే మీకే ప్రమాదమూ ఉండదు...."

"మరి నీకు?"

"నేనెలాగూ ప్రమాదంలో వున్నాను. మిమ్మల్నిందులో ఇరికించలేను...."

"అలాంటప్పుడు ముందుగా నన్నెందుకు పిలిచావు?"

"వాళ్ళిలా నన్నూ, మిమ్మల్నీ వేటాడతారని అనుకోలేదు...."

కిల్లర్ ఆమెవైపు వంగి నెమ్మదిగా—"ప్రమాదాలంటే నాకిష్టం. నన్ను ప్రమాదానికి గురి చేయాలనుకునే వారే ప్రమాదానికి గురవుతారు. ప్రతిఫలం ఆశించకుండా నిన్ను నేను ప్రమాదంనుంచి రక్షించగలను. ఎటొచ్చీ

ప్రమాదంనుంచి తప్పించుకోవాలన్న కోరిక నీకుండాలి. ఆలోచించుకో—" అన్నాడు.

చేతన మాట్లాడలేదు.

కాసేపిద్దరిమధ్యా మౌనం రాజ్యమేలింది.

"ఏం నిర్ణయించుకున్నావు?" అన్నాడు కిల్లర్.

"నేను లేచి వెళ్ళలేదు కదా! మీతో కలిసి సినిమా చూస్తాను...."

3

సినిమా అయ్యేవరకూ విశేషాలేమీ జరుగలేదు.

"నేను నిన్ను మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తాను...." అన్నాడు కిల్లర్.

చేతన మౌనంగా అతడి ననుసరించింది.

ఇద్దరూ వ్యాన్లో కూర్చున్నారు. డ్రైవింగ్ సీట్లో ఉన్న కిల్లర్‌కి కాస్త దూరంగానే కూర్చుంది చేతన.

"మంచి పిల్ల!" అనుకున్నాడు కిల్లర్. అతడు వెంటనే వ్యాను స్టార్టు చేయకుండా — "మొత్తం నీ కథంతా ఇప్పుడు చెప్పు—" అన్నాడామెతో.

చేతన గొంతు సవరించుకుని — "నేను సుస్మితా కాస్మెటిక్స్ కంపెనీలో పనిచేస్తున్నాను. అవసరానికి మించిన జీతం నాకు లభిస్తోంది. అందువల్ల జీవితం తృప్తిగా నడిచిపోతోంది. అయితే ఇటీవల కొందరు నా వెంట పడుతున్నారు. తాము చెప్పినట్లు చేయమనీ— చేస్తే లక్షలార్జించవచ్చుననీ ఆశ పెడుతున్నారు. నేనొప్పుకోకపోతే బెదిరిస్తున్నారు. ఈరోజు సినిమా ప్రోగ్రాం నేను వేసుకున్నది కాదు...." అని ఇంకా ఏదో చెప్పబోతూండగా—

"ఒక్క నిముషం.. నీకింట్లో ఎవరూ లేరా?" అన్నాడు

కిల్లర్.

“అన్నయ్యున్నాడు....”

“నీ అన్నయ్యకీ విషయం చెప్పలేదా?”

“థియేటర్లోంచి బయటకు వెళ్లేక నా పక్కన మీరు చూసిన వ్యక్తి నా అన్నయ్య ...అతడి పేరు శంకరం” అంది చేతన.

కిల్లర్ ఆశ్చర్యంగా—“ఏ అన్నా—చెల్లిని స్మగ్లింగుకు ప్రోత్సహించదు—” అన్నాడు.

“అన్నయ్య నెవరో దురలవాట్లకు గురిచేసి తన చేతిలో కీలుబొమ్మను చేసుకున్నారు. స్మగ్లింగుకే కాదు-వ్యభిచారానికి కూడా ప్రోత్సహించగలడిప్పుడు నన్ను అన్నయ్య—” అంటూ చేతన వంగి మోకాళ్ళమీద తల పెట్టుకుని ఏడ్చింది.

“ఏడ్చి సాధించేదేమీ ఉండదు....జరిగింది చెప్పు....”

“అన్నయ్యకిప్పుడు కొత్త స్నేహాలేర్పడ్డాయి. వాడి స్నేహితులింటికి వచ్చి నాతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నా అన్నయ్య మాట్లాడేవాడు కాదు. ఆడదానికి శీలం ముఖ్యం కాదనీ, అన్నింటికీ డబ్బు కావాలనీ హితబోధలు చేస్తూండేవాడు....”

అని చేతన ఒక్కక్షణం ఆగి—“నిజానికి అన్నయ్యెంతో మంచివాడు. నన్ను ప్రాణానికి ప్రాణంగా పెంచాడు. కాలేజీలో చదువుతూండగా ఎవడో నా చేయి పట్టుకున్నాడని తెలిసి వెతుక్కుంటూ వెళ్ళి నాలుగు తన్ని వచ్చాడు. నన్నో యింటిదాన్ని చేసేవరకూ తను పెళ్ళి చేసుకోనన్నాడు. అలాంటిది రెండేళ్ళనించీ అన్నయ్యలో మార్పు ప్రారంభమై ఇప్పుడు భరించరానిదిగా తయారయింది. అందుకే నేను అన్నయ్యను వదిలిపెట్టి

నా స్నేహితురాలు సుధ యింట్లో వుంటున్నాను. సుధ తలిదండ్రులు నన్నభిమానంతో ఆదరించారు..." అంది.

"నీ కథ చాలా విచిత్రంగా వుంది. నువ్విల్లు మారితే మీ అన్నయ్యూరుకున్నాడా?" అన్నాడు కిల్లర్.

"ఊరుకోలేదు కానీ ఘన పదవులు వేస్తున్నాగా వున్నాయని చెప్పాను. తనమీద నాకే కోపమూ లేద న్నాను. నాకు పెళ్ళి కాఫురానికి వెళ్ళిపోయాననుకో మన్నాను. కొన్ని నెలలపాటు అన్నయ్య నా జోలికి రాలేదు. సంతోషించాను. అయితే రెండు వారాలనుంచి కొందరు వ్యక్తులు నన్ను వెంటాడి తమకు సహకరించమని వేధిస్తున్నారు. వాళ్ళకు అన్నయ్య రికమెండేషనుంది. అన్నయ్య స్వయంగా నన్ను కలుసుకుని వాళ్ళు చెప్పి నట్లు చేయకపోతే ప్రమాదముని హెచ్చరించాడు కూడా. నేను ప్రమాదానికి సిద్ధమేనని చెప్పాను.

ఈ రోజు అన్నయ్య సినిమాకని రెండు టికెట్సు బుక్ చేసుకుని వచ్చేనని చెబితే జాలిపడి థియేటర్ కు వచ్చాను. అన్నయ్య నాకు రెండు టికెట్స్ యిచ్చి యిప్పుడే వస్తానని వెళ్ళాడు. తర్వాత మిమ్మల్ని థియేట ర్లోంచి బయటకు పిలిచిన యువకుడు నా దగ్గరకు వచ్చి నీ అన్నయ్య రాడు.... నేనూ నువ్వూ కలిసి సినిమా చూస్తాం—అన్నాడు. అతణ్ణి చూస్తే నాకు భయం వేసింది. మనిషి మర్యాదస్థుడిలా లేడు...." అని ఆగింది చేతన.

"ఊఁ" అన్నాడు కిల్లర్.

చేతన చెప్పుకుపోతూంటే జరిగిందతడికి కళ్ళకు కట్టి నట్లుంది.

* * *

"నేను నీతో సినిమా చూడను" అంది చేతన.

"మరి—ఎవరితో చూస్తావ్?"

"అసలు సినిమాయే చూడను" అంది చేతన.

"చూడకుంటా థియేటర్ బయటే కూర్చుండి పోతావా?"

"ఇక్కడే యెంగుకుంటాను. ఇంటికి వెళ్ళిపోతాను!"

"సినిమా చూడకుండా నువ్వింటికి వెళ్ళలేవు...."

"అంటే?"

"ఇప్పుడిక్కణ్ణించి బయటకు వెడితే నువ్విల్లు చేరవు...." అని—"నా యిల్లు చేరతావు" అన్నాడు.

చేతన భయపడింది.

"ఇక్కడుంటే నీ కేమీ భయంలేదు. థియేటర్లో నీకో వస్తువు అందుతుంది. అది నువ్వు నేను చెప్పిన చోటుకు చేర్చాలి" అన్నాడతడు.

నాలుగు రోజుల క్రితం ఒక వ్యక్తి ఆమె ఆఫీసుకు వెళ్ళేముందు కలుసుకుని ఒక బ్రీఫ్ కేసివ్వబోయాడు. చేతన తీసుకోలేదు.

ఇది అలాంటి కేసేనని చేతన అనుకుంది.

"ఇలాంటి పనులు నాకిష్టంలేదు" అంది చేతన.

"ఈ పనులు నీకిష్టం లేదంటే—నిజంగా నీకిష్టంలేని పనులు నీచేత చేయించాల్సి వస్తుంది" అన్నాడతడు.

"అంటే?"

"ఆడపిల్లవు. ఆ మాత్రం అర్థం చేసుకోలేవా—నువ్విక్కడే వుండు. ఇప్పుడే వస్తాను" అంటూ అతడు పక్కకు వెళ్ళాడు.

ఏం చేయాలో తోచక అక్కడే నిలబడివున్న చేతనకు కిల్లర్ కనిపించాడు. అతణ్ణి చూడగానే మర్యా

వణుకనిపించింది. అతడి ముఖంలో రత్న కనపడిం దామెకు.

ఆ యువకుడినుంచి తప్పించుకు నేందు కామె కిల్లర్‌తో చనువుగా మసిలింది.

ఇద్దరూ థియేటర్లో కూర్చున్నాక ఆ యువకుడు వచ్చి కిల్లర్‌ని బైటకు పిలిచాడు. కిల్లర్ బయటకు వెళ్ళగానే శంకరం ఆమె పక్కకు వచ్చి కూర్చున్నాడు.

"నువ్వెక్కడున్నావు?" అంది చేతన ఆశ్చర్యంగా.

"నా టికెట్సు వేరే వున్నాయి...." అన్నాడు శంకరం.

"ఏమిటిదంతా?"

"చెల్లాయ్—నా మాట విను—నీ సీట్లోకి ఎక్స్‌చేంజి మీద నా మిత్రుణ్ని పంపిస్తాను. నువ్వు సీటు మారిపో" అన్నాడు శంకరం.

"ఎందుకు?"

"నీ కందజేయబడే వస్తువు—నీ వ్యానిటీబ్యాగులో పట్టే సైజులోనే వుంటుంది. ఇందులో ప్రమాదమేమీ వుండదు. కాదంటేనే ప్రమాదం...."

"ఏమిటా ప్రమాదం?"

"నా నోటితో నేను చెప్పలేను."

"అన్నయ్యా! నువ్వెందుకు చెడుస్నేహాలు పట్టావు. నీ యిబ్బందేమిటో చెప్పు. వీలుంటే నీ స్నేహితులను పోలీసులకు పట్టిద్దాం" అంది చేతన.

"చెల్లాయ్ — అన్నయ్యగా నీ మేలుకోరి నిన్ను హెచ్చరిస్తున్నాను. నన్నిక్కడే నా కూర్చోనివ్వు. లేదా సీటు మారిపో. లేకుంటే నీకే అన్యాయం జరిగినా నేను

సాయపడలేను" అన్నాడు శంకరం గంభీరంగా.

[illegible] అంగి వచ్చాడు.

* * *

"నీ కథ చిత్రంగా వుంది. అందరూ నీ కోసమే ఎందుకు ప్రయత్నిస్తున్నారో నాకు తెలియడంలేదు" అన్నాడు కిల్లర్.

"నాకూ తెలియడంలేదు" అంది చేతన.

"నువ్వు నన్నే ఎందుకెన్నుకున్నావు?"

"మీ ముఖంలో నాకు రక్షణ కనపడింది!"

"ఏమిటి నా ముఖంలోని ప్రత్యేకత?"

"మీ మీసాలు...."

కిల్లర్ చేయి అప్రయత్నంగా మీసం దువ్వింది. తన మీసం చూసి ఆడపిల్ల రక్షణ కోరడం ఇది మొదటిసారి కాదు.

ఒక యువతి తన్ను రక్షణ కోరితే అపాయం చేసు కున్నాడు. ఫలితంగా ఆమె హత్య చేయబడింది.

ఇప్పుడు చేతన తననుండి రక్షణకోరుతోంది.... ఈమెను తను రక్షించితీరాలి.

"మిస్ చేతనా! నీ అదృష్టం గొప్పది. నేను నిన్ను రక్షించగలను...."

చేతన జీవంలేని నవ్వు నవ్వింది.

"ఇప్పుడు నిన్నెక్కడ దిగబెట్టాలో చెప్పు" అన్నాడు కిల్లర్.

"అది నాకే తెలియడంలేదు...." అంది చేతన.

"ఎందుకని?"

"అన్నయ్య దగ్గరకు వెళ్ళడంలో ప్రమాదముంది. కానీ ఇప్పుడు సుధ ఇంటికి వెళ్ళాలన్నా భయంవేస్తోంది.

అన్నయ్య స్నేహితులు సుధకు ప్రమాదం తలపెడతారేమోనని భయంగా వుంది. నా కారణంగా ఆ కుటుంబం ప్రమాదంలో పడడం నా కిష్టంలేదు" అంది చేతన.

"ఇన్నాళ్ళూ లేని ప్రమాదం ఆ కుటుంబానికి రోజే ఎందుకు వస్తుంది?"

"ఈ రోజు అన్నయ్య స్నేహితులు నన్ను పట్టుకోవాలని చాలా పట్టుదలగా వున్నారు" అంది చేతన.

"అయితే ఒక పని చేద్దాం" అన్నాడు కిల్లర్.

"ఈ రాత్రికి నువ్వు నా వ్యాన్లో పడుకో. నా వ్యాను—ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్ ఇంట్లో సురక్షితంగా వుంటుంది. లోపల నువ్వున్నట్లు ఇన్‌స్పెక్టర్‌కి కూడా తెలియదు. నా వ్యాన్లో సదుపాయాలు—స్టార్ హోటల్లో కంటే బాగుంటాయి" అన్నాడు మళ్ళీ కిల్లర్.

"మీ యిష్టం" అంది చేతన.

డ్రైవింగ్ సీట్లోంచి లోపలకు దారివుంది. ఆ తలుపు తీసి కిల్లర్, చేతనను లోపలకు తీసుకుని వెళ్ళాడు. అక్కడి ఏర్పాట్లు చూసి చేతన తెల్లబోయింది.

"ఇదంతా ఏరోప్లేన్ మోడల్.... రాత్రి నువ్వు సుఖంగా గడపొచ్చు. ఇంకో విశేషం—ఇది సౌండ్ ప్రూఫ్. లోపల నువ్వే చప్పుడు చేసినా బయటకు వినపడదు...."

చేతన విచిత్రంగా అక్కడి సదుపాయాలు చూస్తోంది.

కిల్లర్ లోపలున్న క్యారియర్ విప్పాడు. అందులో చపాతీలున్నాయి ఘుమఘుమలాడే కూర్మావుంది.

ఇద్దరూ చపాతీలు తిన్నారు.

కిల్లర్ తను మంచినీళ్ళు తాగి ఆమెకు మంచినీళ్ళిచ్చాడు.

"కడుపు నిండిపోయింది" అంది చేతన.

"పళ్ళు తింటే తప్ప కడుపులో చల్లగా వుండదు" అంటూ కిల్లర్ రెండు బత్తాయిలు వలిచి—ఒకటి ఆమె కిచ్చాడు.

మొహమాట పడుతూనే చేతన పండు తింది.

"ప్రమాదం నుంచి రక్షించడమే కాదు....మీ ఆతిథ్యంవల్ల కూడా నేను మీకు ఋణపడివున్నాను" అంది చేతన.

"నేను నిన్ను రక్షించగలనో లేదో ఇంకా నాకు తెలియదు. నా ప్రయత్నం నేను చేస్తాను. ఈ విషయంలో నా కంటే బాగా ప్రయత్నించగలవా రెవ్వరూ వుండరని నీకు హామీ యివ్వగలను. ఇక ఆతిథ్యం సంగతంటావా? అందుకు ఋణపడనవసరంలేదు. నా ఋణం తీర్చుకునే అవకాశం నీ కిస్తాను" అన్నాడు కిల్లర్.

"నేనీ ప్రమాదం నుంచి బయటపడ్డాక మీకు తప్పకుండా ఆతిథ్య మిచ్చి కొంత ఋణం తీర్చుకుందుకు ప్రయత్నిస్తాను" అంది చేతన.

"సరే—నువ్వింక విశ్రాంతి తీసుకో—హరిహరాదులు వచ్చినా, ఆఖరికి నువ్వే కావాలనుకున్నా కూడా ఇక్కణ్ణించి బయటపడలేవు. నేను తిరిగి వచ్చి తలుపు తీసేవరకూ లోపల బుద్ధిగా వుండు" అంటూ కిల్లర్ అక్కణ్ణించి బయటప వచ్చి బయటినుంచి తలుపు వేసి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు.

4

మొబైల్ వ్యానును ఇన్ స్పెక్టర్ చంద్రకాంత్ ఇంటి ముందు ఆవరణలో వుంచి అతని దగ్గర సెలవు తీసుకుని బయటపడేసరికి - కిల్లర్ కి టైము పదకొండయింది.

అతడు నడుచుకుంటూ సందు మలుపు తిరిగేసరికి అక్కడ ఓ యువకుడు కనిపించాడు. చేతిన అన్నయ్య శంకరంగా అతణ్ని గుర్తుపట్టాడు కిల్లర్.

"హలో — శంకరం! కులాసానా" అన్నాడు కిల్లర్.

శంకరం ముఖం దీనంగా అయిపోయింది "నీ మీద పోలీసు కంప్లయింట్ యివ్వాలనుకున్నాను. కానీ నువ్వే పోలీసుల్లోంచి బయటకు వచ్చావు"

"నామీద కంప్లయింటా — ఎందుకు?"

"నా చెల్లెల్ని కిడ్నాప్ చేసినందుకు ..."

"కిడ్నాపర్స్ నుంచి నీ చెల్లెల్ని కాపాడిన నామీద-కిడ్నాపింగ్ నేరం మోపాలనుకున్నావా? అందుకు నీ చెల్లెలు సహకరించదని తెలియదూ?" అన్నాడు కిల్లర్.

"అయాం వెరీ సారీ! నేను చాలా పొరపాట్లు చేశాను. నా చెల్లెలికి నువ్వేమీ ప్రమాదం తలపెట్టలేదు కదా!"

"ఆమెకు పోలీసురక్షణ కల్పించాను...."

"థాంక్స్" అన్నాడు శంకరం.

"అది చెప్పడానికే నన్నిక్కడ కలిశావా?"

"లేదు. నేను నా చెల్లెలి విషయంలో చాలా అన్యాయంగా ప్రవర్తించాను. నా తప్పు దిద్దుకోవాలి. అందుకే నిన్ను కలిశాను."

"అయితే సరాసరి ఇన్స్పెక్టరింటికి ఎందుకు రాలేదు?"

"రాలేను. నేనో గూడుపుఠాణీలో ఇరుక్కున్నాను. నువ్వు నా చెల్లిని పోలీసుల కప్పగించావు. అందువల్ల నా జీవితం ప్రమాదంలో పడింది. అందుకు నేను బాధపడను.

కానీ నా చెల్లి సమస్య ఈ రాత్రితో తీరిపోదు. దాని మీద మహాబలవంతుడొకడు పగబడతాడు. ఇకమీదట అడుగడుగునా దానికి ప్రమాదమే!" అన్నాడు శంకరం.

"నేను నీ చెల్లిని ప్రమాదంనుంచి రక్షించగలను" అన్నాడు కిల్లర్.

"నీ శక్తి నాకు తెలియదు. కానీ నా చెల్లిని పోలీసుల కప్పగించడం ద్వారా యిప్పుడు నువ్వూ ప్రమాదంలో పడ్డావు. ఈ సమయంలో నీకు నేను ఉడతాభక్తిగా చేయగల సాయం కొంత వుంది. నాయింటికి వస్తావా?" అన్నాడు శంకరం.

"ష్యూర్" అన్నాడు కిల్లర్.

ఇద్దరూ కాలినడకన ఒక అరగంటసేపు నడిచి ఓ యింటి ముందాగారు.

"ఇదా నీ యిల్లు?" అన్నాడు కిల్లర్.

"ఊఁ"

"బావుంది" అన్నాడు కిల్లర్.

చిన్న పెంకుటిల్లది.

ఇద్దరూ మెట్లెక్కారు.

"తలుపుకు తాళంలేదే?" అన్నాడు కిల్లర్.

"నేనిప్పుడొక మహాబలవంతుడికి అనుచరుడిగా వుంటున్నాను. తన అనుచరుల యింటికి తాళాలుండడానికి నాయన హర్షించడు ..."

"ఏమైనా పోతే?"

"ఎవరైనా నాకు తెలియకుండా ఇక్కడడుగు పెడితే వాణ్ణి మూల్లోకాల్లో ఎక్కడున్నా మూడు నిముషాల్లో పట్టుకోగలడు బాస్!"

"అయితే ఈ విషయం రేపు పరీక్షించాలి" అన్నాడు

కిల్లర్.

"కావేందుకు—ఇప్పుడే పరీక్షించుకోవచ్చు".

"ఇప్పుడు నీవు తెలిసేకదా లోపల అడుగు పెడు తున్నాను."

శంకరం నవ్వి తలుపు తోశాడు. తను లోపలకు వెళ్ళి స్విచ్ వేశాడు.

కిల్లర్ లోపల అడుగుపెట్టి తలుపులు దగ్గరగా వేశాడు.

చిన్నగది.... నాలుగు ఇనుప కుర్చీలు....

"లోపలకు వెడదాం" అన్నాడు శంకరం.

కిల్లర్ అంగీకార సూచనగా తలాడించాడు.

పక్కనే దగ్గరగా తలుపు మూసివున్న గది ఒకటుంది. తలుపు తోసుకుని శంకరం అందులోకి వెళ్ళాడు.

ఈ గది విశాలంగా వుంది.

గది మధ్యలో డబుల్ కాట్ వుంది. బయటనుంచి చూస్తే ఈ యింట్లో అంతమంచి మంచాలుంటాయని ఎవరూ అనుకోరు.

గదిలో నాలుగు వైపులా గోడల కానుకుని నాలుగు బీరువాలున్నాయి.

"నువ్వలా మంచంమీద కూర్చో! నేను మంచినీళ్ళు తాగి వస్తాను" అన్నాడు శంకరం.

"మంచినీళ్ళు నాకూ కావాలి- నేనూ నీతో వస్తాను" అన్నాడు కిల్లర్.

అప్పుడు చటుక్కున కిల్లర్ కెదురుగా ఉన్న బీరువా తలుపు తెరుచుకుంది. అందులోంచి కండలు తిరిగిన వస్తాదొకడు బయటకు వచ్చాడు.

"నీ చేత మంచినీళ్ళు నేను తాగిస్తాలే" అన్నాడు

వస్తాడు.

శంకరం అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

కిల్లర్ ఆశ్చర్యంగా చుట్టూ చూశాడు.

ప్రతీ బీరువాలోంచీ ఒకడు చొప్పున అక్కడ మొత్తం నలుగురు మనుషులతణ్ని చుట్టుముట్టారు.

వారిలో ముగ్గురు వస్తాదులైతే ఒకడు మాత్రం థియేటర్ వద్ద కిల్లర్ని బొమ్మజూపి బెదిరించినవాడు.

“నాకోసం వస్తాదుల్ని తీసుకొచ్చేవా?” అన్నాడు కిల్లర్.

ఆ వ్యక్తి నవ్వి — “భయపడకు. వీళ్ళు ముగ్గురూ నిన్నేమీ చెయ్యరు. నేను నీకు బుద్ధి చెబుతున్నప్పుడు పారిపోకుండా ఆపడానికే వీళ్ళు ” అన్నాడు.

“నాకు బుద్ధి చెప్పడంకోసం నువ్వు పారిపోతావా?” అన్నాడు కిల్లర్ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

“పారిపోయేది నువ్వు. నేను కాదు....”

“నేనెందుకు పారిపోతాను?” అన్నాడు కిల్లర్.

“ప్రాణభయంవల్ల ....”

“నా ప్రాణాలకిప్పుడొచ్చిన భయమేముంది?”

“నా హెచ్చరికను లక్ష్యపెట్టనివాడికి ప్రాణభయం తప్పదు....”

“అయితే నువ్విప్పుడు నాకు బుద్ధి చెబుతానంటావు. ఆ సమయంలో ఈ వస్తాదులు ముగ్గురూ బుద్ధిగా వుంటారంటావు....” అన్నాడు కిల్లర్.

“అఫ్‌కోర్స్!”

“నాకు నీ మాటలమీద నమ్మకంలేదు. నీ ఆత్మరక్షణ కోసం వీళ్ళనిక్కడుంచుకున్నావని నా అనుమానం....”

ఆ వ్యక్తి నవ్వి — “నీ అనుమానమేదైనా వాళ్ళి

క్కడే ఉంటాను...." అన్నాడు.

"వాళ్ళనిక్కడే ఉండనిద్దాం. కానీ వాళ్ళు నీమాట వినాలిగా.... అందుకు నేను సాయపడలేను—.." అంటూ కిల్లర్ మెరుపు వేగంతో గాలిలో ఎగిరి శరవేగంతో కాళ్ళూ చేతులూ కదిలించాడు. చెప్పాలంటే అప్పుడతడి చేతులూ, కాళ్ళూ — శరవేగంతో తిరిగే చక్రంలోని ఆకుల్లా ఉన్నాయి.

కిల్లర్ మామూలుగా నేలమీద నిలబడేసరికి వస్తాదులు ముగ్గురూ మూడువైపుల గోడవారగా చతికిలబడి ఉన్నారు.

ఆ వ్యక్తి తెల్లబోయి కిల్లర్ వంక చూశాడు....

"చేతిదెబ్బకు నరాలు చచ్చుబడి కూలబడ్డారు. కాలితో తోసేసరికి గోడవారకు వెళ్లారు. ఇప్పుడు వాళ్ళు గదిలో ఇంకేం జరిగినా చూస్తూ ఊరుకోవడం మినహాయించి ఇంకేమీ చెయ్యలేరు...." అన్నాడు కిల్లర్.

వస్తాదులు ముగ్గురూ అలానే కూర్చుని అసహాయంగా తమ బాస్ వంక చూశారు.

ఆ వ్యక్తి రవంత చలించినా గాంభీర్యాన్ని వదిలిపెట్టకుండా—"ఎవర్నువ్వు?" అనడిగాడు.

"ముందు నువ్వెవరో తెలుసుకుని—అప్పుడు నా వివరాలు చెబుతాను...." అంటూ కిల్లర్ అతణ్ని సమీపించాడు.

"అదంత సులభం కాదు...." అంటూ బాస్ గాల్లోకి ఎగిరాడు.

కిల్లర్ చటుక్కున వంగి అతడి కాళ్ళు పట్టుకుని లేచి నిలబడి గిరగిరా తిప్పి-గాలిలోకి విసిరి కిందపడిపోకుండా నిలబెట్టిపట్టుకున్నాడు.

ఆ వ్యక్తికి కళ్ళు గిరగిరా తిరిగాయి. మామూలు మని షవడానికి కాసేపు పట్టింది.

అతడు నిలదొక్కుకున్నాక — "ఎవరు న్నువ్వు?" అన్నాడు కిల్లర్.

"నా పేరు రాజా!" అన్నాడా వ్యక్తి.

"మిస్టర్ రాజా నువ్వు చేతన వెంట ఎందుకుపడ్డావో చెప్పు .."

"ఆమె చాలా అందమైనది. మా స్మగ్లింగ్ ఆప రేషన్స్ కామె బాగా పనికివస్తుంది—"

"దేశంలో అందమైన ఆడవాళ్ళంతా యెందరో ఉన్నారు. నువ్వు చేతననే ఎందుకు పట్టుపట్టావు...." అన్నాడు కిల్లర్.

"ఇలాంటి పనులకు పెద్దల సహకారం లేనిదే ఆడపిల్ల లుపయోగపడరు. చేతన విషయంలో వాళ్ళన్నయ్య అంగీ కారం లభించింది...."

"ఎలా లభించింది?"

"అతడికి డబ్బు కావాలి...."

"మిస్టర్ రాజా! కేవలం డబ్బుకోసం ఏ అన్నా చెల్లెల్ని అమ్ముకోడు. అంతకంటే ఘోరమైనదింకేదో ఉంది...."

"ఇంకేమీ లేదు ...."

"నువ్వు చెప్పకపోయినా ఆ విషయం శంకరాన్ని చూడగానే తెలుస్తుంది. మీరతడికి మత్తు పదార్థాలను బాగా అలవాటు చేశారు. ఆ అలవాటు కతడు బాని సయ్యాడు. మీరు చెప్పినట్లల్లా ఆడుతున్నాడు...."

రాజా మాట్లాడలేదు.

"ధనిక యువకులకివి అలవాటు చేస్తే బాగా డబ్బు

సంపాదించవచ్చు. కానీ శంకరం వంటి సామాన్యుల నెందుకు మీరీ అలవాటుకు గురిచేస్తున్నారు?"

"ఊహించి చాలా తెలుసుకున్నావు. ఇదీ తెలుసుకో లేవా?" అన్నాడు రాజా.

కిల్లర్ ఒక్క క్షణం ఆలోచించి—"స్మగ్లింగుకు అందమైన ఆడపిల్లలు బాగా పనికి వస్తారు. వాళ్ళు మధ్య తరగతి ఆడపిల్లలైతే ఎవరికీ అనుమానముండదు. కాబట్టి మాకింకా మంచిది. అలాంటి ఆడపిల్లలు పెద్దలకు తెలియకుండా ఏ వ్యవహారాలకూ దిగలేరు. అందుకని మాకు అలాంటివాళ్ళలో శంకరంలాంటి వారిని మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తున్నారు. చెప్పాలంటే మాకు శంకరమంటే ఆసక్తి లేదు. చేతనకోసం శంకరాన్ని దువ్వారు...." అన్నాడు.

"నువ్వు చాలా తెలివైనవాడివి." అన్నాడు రాజా.

"నా తెలివి నీకు రేపుదయానికింకా బాగా అర్థమవుతుంది...." అంటూ కిల్లర్ అతడి మెడమీద ఒక దెబ్బ వేశాడు.

రాజా కుప్పలా కూలిపోయాడు.

5

మర్నాడుదయం....

వస్తాదులు, రాజా నేలమీదపడి నిద్రపోతున్నారు.

కిల్లర్ మంచంమీద కళ్ళు విరుచుకుంటూ లేచి—"మీరెవరూ ఇంకా నిద్ర లేవలేదా?" అంటూ అరిచాడు.

ఎవ్వరూ లేవలేదు.

అప్పుడతడే దగ్గరగా వెళ్ళి వీపుతట్టి ఒకొక్కరినే నిద్రలేపాడు.

నలుగురూ మత్తు మత్తుగా కళ్ళు తెరిచారు. వాళ్ళకు

పూర్తి మెలకువ రావడానికి కాసేపట్టింది.

కిల్లర్ కళ్ళు మంచంమీద పడుకుని — "మీకు పూర్తిగా మెలకువ వచ్చేక నా దగ్గరకు రండి!" అన్నాడు.

అప్పటికి రాజాకూ, వస్తాదులకూ తమ పరిస్థితి తెలిసింది. అతడు హాయిగా పరుపుల మంచంమీద నిద్రపోయాడు. తాము కటిక నేలమీద నిద్రపోయారు. అయితే జీవితంలో ఎన్నడూ వారింతటి సుఖనిద్ర ఎరుగరు. కళ్ళు నొప్పులుగా వున్నా మెదడులోపల ఎంతో ప్రశాంతంగా ఉంది.

రాజా కిల్లర్ని సమీపించి— "ఎవర్నువ్వు?" అన్నాడు.

"శరణు కోరిన వారిని రక్షించడమే ధ్యేయంగా పెట్టుకున్న అవతార పురుషుణ్ణి—" అన్నాడు కిల్లర్.

"ఇప్పుడేం చేయదల్చుకున్నావు?" అన్నాడు రాజా.

"నువ్వే చెప్పాలి!"

"జరిగిందానికి గర్వపడకు. ఇంతకింతా అనుభవిస్తావు."

"ఒకసారి నన్ను హెచ్చరించి ఒక రాత్రంతా పడుకున్నావు. నన్ను మళ్ళీ మళ్ళీ హెచ్చరించాలంటే సిగ్గుగా లేదూ నీకు!" అన్నాడు కిల్లర్.

"ఇల్లలకగానే పండుగ కాదు—...." అన్నాడు రాజా.

"ఎప్పుడు పండుగవుతుందో చెప్పు...." అన్నాడు కిల్లర్.

"నేను బయటకు వెడుతున్నాను-పండక్కి ఏర్పాట్లు చేయడానికి...."

"నా అనుమతి లేకుండా ఎక్కడికి వెడతావ్?" అన్నాడు కిల్లర్.

“నాకు తోచిన చోటుకి ”

“ఇప్పుడు ఏకేమైనా తోస్తోందా అసలు....” అంటూ కిల్లర్ మంచంమీంచి లేచి నిలబడి—“ఎలా వెడతారో చూస్తాను—” అని చేతులు కరాటే పోజులో పెట్టాడు.

వస్తాదులు కానీ, రాజా కానీ అతణ్ని సమీపించే సాహసం చేయలేకపోయారు.

“ఇప్పుడేం చేస్తావు?” అన్నాడు రాజా నిస్పృహగా.

“మిమ్మల్ని పోలీసుల కప్పగిస్తాను....”

“ఆ పని రాత్రే యెందుకు చేయలేదు?” అన్నాడు రాజా.

“శంకరాన్ని రక్షించేవరకూ మిమ్మల్ని పోలీసుల కప్పగించదల్చుకోలేదు. ఎందుకంటే నీ వెనుక ఇంకా ఎవరో ఉంటారని నా అనుమానం. నీకు ప్రమాదముందని నీవాళ్ళకనుమానం కలిగితే నా పని పూర్తికాదు....”

“అంటే మిమ్మల్నిప్పుడు పోలీసుల కప్పగిస్తాననే మాట....పోలీసుల పేరు చెబితే మేము ప్రాణాలకు తెగిస్తామని ఊహించలేవా?” అంటూ రాజా సన్నగా ఈల వేశాడు.

అంతే—వస్తాదులు ముగ్గురూ కిల్లర్ మీద మెరుపుదాడి చేశారు.

ఒక వస్తాదు కిల్లర్ కాళ్ళు బలంగా పట్టుకున్నాడు. రెండో వస్తాదు కిల్లర్ రెండు చేతులూ వెనక్కి విరిచి పట్టుకున్నాడు. మూడో వస్తాదు అతడి భుజాలమీద గట్టిగా గుద్దాడు.

కిల్లర్ మెడ వేలాడేశాడు.

“అతడు జిత్తులమారి. పట్టు సడలించకండి—” అన్నాడు రాజా. అతడు పక్క గదిలోనికి వెళ్ళి సన్నని

తాడు తెచ్చి కిల్లర్ కాళ్ళూ చేతులూ కట్టేశాడు.

"కాసేపు నేలమీద పడుకోబెట్టండి—" అన్నాడు రాజా.

వస్తాదులు కిల్లర్ని నేలమీద పడుకోబెట్టారు.

రాజా అతడివంక కసిగా చూశాడు. కిల్లర్ ఇంకా కళ్ళు మూసుకునే వున్నాడు. రాజా అతణ్ని కాలితో ఒక్క తాపు తన్నాడు.

కిల్లర్ నేలమీద దొర్లాడు.

రాజా అతణ్ణలా నాలుగైదుసార్లు తన్నేసరికి కిల్లర్ కళ్ళు తెరిచి బాధగా అరిచాడు.

"స్పృహ వచ్చిందా?" అన్నాడు రాజా.

"ఏమిటిదంతా?" అన్నాడు కిల్లర్.

"చెప్పానుగా — ఇల్లలకగానే పండగ కాదని...."

కిల్లర్ పళ్ళు బిగబట్టి — "నువ్విలా అన్నందుకైనా నీ చేత ఇల్లలికించి ఓ పండుగ చేసుకుంటాను ...."

"ఇంకా నీకు బుద్ధి రాలేదా?" అన్నాడు రాజా.

"రాత్రి జరిగిందానికి నీకు బుద్ధొచ్చిందా?" అన్నాడు కిల్లర్.

రాజా పళ్ళు బిగబట్టి—"ఇప్పుడు చేతన నెవరు రక్షిస్తారో చూస్తాను—" అన్నాడు.

"చేతన గురించి ఆలోచించి చూడు. ఊహల్లో కూడా నీకామె దొరకదు...."

"నీకు వాగుడెక్కువగా వుంది—" అంటూ రాజా ఓ వస్తాదుకు సైగ చేశాడు. వస్తాదు లోపలకు వెళ్ళి ఓ రుమాలు తెచ్చి బలంగా కిల్లర్ నోట్లో కుక్కాడు.

కిల్లర్ ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తూ ఆ వస్తాదు వంక క్రూరంగా చూశాడు. ఆ చూపులకు చలించిన

వస్తాదు — "సార్! కళ్ళక్కూడా గంతలు కడదాం. వీడి కళ్ళు చూస్తే నాకు భయంగా వుంది-" అన్నాడు.

"ఊఁ" అన్నాడు రాజా.

ఓ నల్లగుడ్డతో కిల్లర్ కు గంతలుకూడా కట్టేక — "వీణ్ని తీసుకెళ్ళి కారు డిక్కీలో పడేయండి—" అన్నాడు.

ఆ యింటికి దొడ్డి గుమ్మం తలుపు తీస్తే ఓ యిరుకు సందుంది. అందులో ఓ కారుంది. ఆ కారు డిక్కీలోకి తరలించబడ్డాడు.

"నీ కాళ్ళు, చేతులు, కళ్ళు, నోరు—అన్నీ బంధించబడ్డాయి. ఉన్న చెవుల్నే ఉపయోగించుకునే సామర్థ్యం నీకున్నదని నాకు తెలుసు. అందుకే యిది...." అంటూ ఓ టేపు రికార్డర్ ఆన్ చేసి డిక్కీలో పెట్టాడు రాజా.

వస్తాదు డిక్కీ తలుపులు మూస్తూ—"సార్ —ఆ టేపు రికార్డరువల్ల ప్రయోజనం!" అనడిగాడు కుతూహలంగా.

"దారిలో గుర్తుగా ఏ చప్పుళ్ళూ వినపడవు. వాడికా టేపురికార్డర్లో సంగీతం తప్ప ఇంకేమీ వినపడదు—" అన్నాడు రాజా.

6

కళ్ళ గంతలు విప్పగానే ఎదురుగా సింహాసనంలాంటి కుర్చీ ఒకటి కనిపించింది కిల్లర్ కి. ఆ సింహాసనం ముందు సుమారు ఆరున్నరడుగుల ఎత్తయిన విగ్రహంతో ఓ దృఢకాయుడు నిలబడి వున్నాడు.

కిల్లర్ అతడివంక ఆశ్చర్యంగా చూశాడు.

అందమైన రాక్షసుడిలా వున్నాడతడు.

"అతణ్ణి మాట్లాడనివ్వండి—" అన్నాడు దృఢకాయుడు.

ఒక వస్తాదు—కిల్లర్ నోట్లోని రుమాలు లాగేశాడు. కిల్లర్ ఒకసారి నాలికతో పెదాలు తడుముకున్నాడు.

"ఎవర్నువ్వ్?" అన్నాడు దృఢకాయుడు.

"ముందు నువ్వెవరివో చెప్పు. అప్పుడు నా గురించి చెబుతాను—" అన్నాడు కిల్లర్.

"నా అనుచరులు నిన్ను బంధించారు. రాజాను నేను నాయకుణ్ణి—"

"నీ పేరు...."

"నీ కవసరం...."

"దయుంచి నా అవసరం గురించి మీరెవ్వరూ ఆలోచించవద్దు. అడిగిందానికి సూటిగా సమాధానం చెప్పు" అన్నాడు కిల్లర్.

దృఢకాయుడు రెండడుగులు ముందుకు వేసి—"నా సాకరంలో నన్నెదిరించి మాట్లాడుతున్నావు. నీకెంత ధైర్యం!" అన్నాడు.

"నా ధైర్యం గురించి నీకు తెలిసింది చాలా తక్కువ. ఇంకా తెలుసుకోవాలంటే ఇప్పుడే చూపించగలను!" అన్నాడు కిల్లర్.

"చూపించు...." అన్నాడు దృఢకాయుడు.

"నీ ముందున్న ఈ రాజాకూ, వస్తాదులకూ నా వంటికున్న ఈ బంధనాలే ధైర్యాన్నిచ్చాయి. ఇప్పుడు చూడు...." అంటూ ఊపిరి బిగబట్టి కాళ్ళూ చేతులూ విదిలించాడు. అప్పుడతడి శరీరం కాస్త కుంచించుకుంది. ఫలితంగా అతడి బంధనాలు వదులుగా నేల జారాయి.

దృఢకాయుడు ఆశ్చర్యంగా చూస్తూండగా కిల్లర్ చిన్న కేక పెట్టి గాల్లోకి ఎగిరాడు.

దృఢకాయుడతడెగిరిన వైపు తిరిగాడు.

కిల్లర్ సరాసరి వెళ్ళి సింహాసనంలో పడ్డాడు. అప్పు డతడు కాలుమీద కాలు వేసుకొని హుందాగా — "నీ సామ్రాజ్యంలో నీ సింహాసనంమీద కూర్చుని నిన్ను నిలబెట్టి ప్రశ్నిస్తున్నాను. ఇప్పుడు చెప్పు — నీ పేరేమిటో!" అన్నాడు.

ఒక్క నిముషం అక్కడున్న వాళ్ళెవ్వరికీ నోట మాట రాలేదు. దృఢకాయుడు త్వరగా తేరుకొని చప్పట్లు కొట్టి—"హేట్సాఫ్ టూయూ...." అన్నాడు.

"అలాగనడానికి నీ తలపై టోపీ లేదు...." అన్నాడు కిల్లర్.

దృఢకాయుడు సింహాసనాన్ని సమీపించి-ఒక చేత్తో కాలర్ పట్టుకొని కిల్లర్ని గాలిలోకి ఎత్తి క్రింద నిలబెట్టి తను సింహాసనంమీద కూర్చుని—"ఇప్పుడేమంటావ్?" అన్నాడు.

"నాకంటే సింహాసనంమీద నువ్వే నిండుగా వున్నావు—" అన్నాడు కిల్లర్.

"నువ్వెవరో ముందు చెప్పు—" అన్నాడు దృఢకాయుడు.

"నీ గురించి తెలుసుకున్నాకనే నా గురించి చెబుతాను...."

"దేశంలో రెండు రకాల వ్యవహారాలు నడుస్తున్నాయి. నాది రెండోరకం వ్యవహారం—" అన్నాడు దృఢకాయుడు.

"అంటే?"

"మగాడికి ఆడదానిమీద మనసు పుట్టిందనుకో! మొదటి రకం పద్ధతేమిటంటే పెళ్ళి చేసుకోవడం! రెండో రకం పద్ధతి—నచ్చిన ఆడదానితో ఓ రాత్రి

గడపడం.... చెప్పానుగా—నాది రెండో రకం పద్ధతి.."
అన్నాడు దృఢకాయుడు.

"మరి కాస్త వివరంగా చెప్పు...."

"ఒక్క ముక్కలో చెప్పాలంటే నేను చేసేవన్నీ చట్టవిరుద్ధమైన పనులు ..."

"అలాగా—నీ పేరు?"

"అర్జున్!" అన్నాడు దృఢకాయుడు.

"థాంక్యూ—నా పేరు కిల్లర్ .... నాది మొదటి రకం వ్యవహారం ...."

"అయితే నువ్వూ నేనూ చేతులు కలుపుదాం— ఇద్దరికీ తిరుగుండదు—" అంటూ చేయి జాపాడు అర్జున్.

"మన చేతులెలా కలుస్తాయి? ఒకరు పాజిటివ్. ఇంకొకరు నెగటివ్—రెండూ కలిస్తే ఫ్యూజు పోతుంది"
అన్నాడు కిల్లర్.

"ఫ్యూజు సంగతి నేను చూసుకుంటాను. చేయిజాపు"
అన్నాడు అర్జున్.

"చాపను—" అంటూ కిల్లర్ చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"అయితే నువ్వొక్కడే శాశ్వతంగా మిగిలిపోతావు.."

"నేనిక్కడుండడంవల్ల నీకే నష్టం...."

అర్జున్ నవ్వి — "వివరించి చెప్పు — వింటాను—"
అన్నాడు.

"ఈ యింటి చుట్టూ పోలీసులుంటారిప్పుడు ..."

అర్జున్ ఉలిక్కిపడి — "పోలీసులా — వాళ్ళెలా వస్తారు?" అన్నాడు.

"ఒకసారి నా మాటల్లో సత్యమెంతుందో నీవాళ్ళను వెళ్ళి చూడమను...."

"చూడ్డానికి వేరే పద్ధతులున్నాయిలే—" అంటూ అర్జున్ తన సింహాసనం చేతులపై ఓ మీట నొక్కాడు.. "అటు చూడు—" అన్నాడు కిల్లర్‌తో.

అప్పుడు ఎదురుగా గోడ ప్రకాశవంతమయింది.

దానిపై ముందో యిల్లు కనబడింది. ఇంటిముందో కారుంది. ఆ పక్కనే పోలీసు జీపుంది ఇంటి ఎదురుగా నలుగురు పోలీసులున్నారు.

క్షణాల్లో ఆ బొమ్మ మాయమై ఇంటి వెనుక భాగం కనపడింది. అక్కడ ఆరుగురు పోలీసులున్నారు.

గోడపై ఇల్లు అన్నివైపులనుంచీ క్రమంగా కనబడుతోంది. ఇంటికి అన్నివైపులా పోలీసులున్నారు.

"మిస్టర్ రాజా! పోలీసులెలా వచ్చారిక్కడికి?" తీవ్రంగా అడిగాడు అర్జున్.

రాజా తడబడి—"నాకు తెలియదు బాస్.... నేను అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాను—" అన్నాడు.

"నన్నడిగితే నేను చెబుతాను. రాజా ఏం చెబుతాడు?" అన్నాడు కిల్లర్.

"చెప్పు...."

"మీవాళ్ళు నన్ను చాలా తక్కువ అంచనా వేశారు. మీ రాజా నన్ను బొమ్మ చూపించి బెదిరించాలనుకున్నాడు. నిన్న రాత్రి వాళ్ళతో ఓ ఆట ఆడాను. అయినా వాళ్ళకు బుద్ధిరాలేదు. ముందు నన్ను శరణు కోరిన చేతనకు రక్షణ కల్పించాను. ఆ తర్వాత శంకరాన్ని బలవంతంగా హాస్పిటల్లో జేర్చాను. పోలీసులు, మానసిక నిపుణులు కూడా అతణ్ణి పరీక్షిస్తున్నారు. అంతటితో కథ ముగియదు కదా! మొత్తం ప్లానంతా ముందుగానే చెప్పి నేను కావాలనే రాజాకు పట్టు

బడ్డాను. తాజా నన్ను కార్లో తీసుకొని పోతూంటే పోలీసులు అతడిననుసరించారు. మీ సాఫరం తెలుసుకున్నారు——....” అన్నాడు కిల్లర్ నవ్వుతూ.

“రాజా! నువ్వు చాలా తెలివితక్కువగా ప్రవర్తించావు....” అన్నాడు అర్జున్ అసహనంగా.

“ఇందులో రాజా తెలివితక్కువతన మేమీ లేదు, అంతా నా తెలివి....” అన్నాడు కిల్లర్.

“నీ తెలివి నా సాఫరంలో పని చేయదు....” అంటూ అర్జున్ కిల్లర్ని సమీపించి — “ఇది చాలా ముఖ్యమైన సాఫరం....ఇంతవరకూ పోలీసుల దృష్టి దీనిపై పడలేదు. నీ మూలంగా అది జరిగింది. అయితే నా తెలివేమిటో నీకు తెలియాలిగా—” అంటూ కిల్లర్ని ఎత్తి సింహాసనం మీద కూర్చోపెట్టాడు. ఆ వెనువెంటనే అతడి మెడ, కాళ్ళు, చేతులు, నడుం — సింహాసనానికి బంధించబడ్డాయి.

“నేను, నా అనుచరులు_ఇక్కణ్ణించి బయటపడతాం. పోలీసులవల్ల మాకే ప్రమాదమూ ఉండదు. మేము వెళ్ళేక బయటేం జరుగుతుందో నువ్వే స్వయంగా చూద్దువుగాని. నువ్విప్పుడు అండర్ గ్రౌండ్ లో వున్నావు. నేను తిగివస్తే తప్ప నీకు మోక్షంలేదు. తల బద్దలు కొట్టుకున్నా పోలీసులకు నీ ఉనికి తెలియదు-” అన్నాడు అర్జున్.

మరుక్షణం గదంతా చీకటైపోయింది. గదిలో మళ్ళీ దీపం వెలిగేసరికి అక్కడ కిల్లర్ మాత్రమే ఉన్నాడు. కొద్దిక్షణాల్లో అతడి బంధనాలు కూడా విడిపోయాయి.

కిల్లర్ సింహాసనంమీంచి దుమికి ఒళ్ళు విరుచుకున్నాడు. తర్వాత ఓసారి గదంతా కలయతిరిగాడు.

అందులోంచి బయటపడ్డానికి ఎక్కడా దారి కనపడలేదు. అప్పుడతడు సింహాసనాన్ని పరిశీలించాడు. దాని మీదెక్కడా మీట అన్నదే కనబడలేదు.

"అర్జున్ అసాధ్యుడు!" అనుకున్నాడు కిల్లర్. అతడు తిరిగి గదిలోనికి వస్తే తప్ప తనకు మోక్షంలేదు.

అర్జున్ వస్తాడా?

రాకపోతే తన గతి ఏమవుతుంది?

కిల్లర్ ఆలోచిస్తూండగానే గోడమీద బొమ్మలు కనిపించసాగాయి.

రాజా, ముగ్గురు వస్తాదులతో కలిసి బయటకు వెళ్ళి కారెక్కాడు. పోలీసులతడి కారును డిక్కీతోసహా శోధించి వెళ్ళనిచ్చారు.

తర్వాత నలుగురు పోలీసులింట్లో చొరబడ్డారు. ఇల్లంతా తిరిగారు. ఎక్కడా అనుమానించతగ్గ వస్తువు లేదు. ఇంట్లో యెవ్వరూ మనుషులు లేరు.

పోలీసులు బయటకు వెళ్ళిపోయారు.

కాసేపట్లో ఇంటి చుట్టూ పోలీసులెవ్వరూ లేరు.

ఆ తర్వాత కొద్దిక్షణాలకు గోడమీద బొమ్మలు ఆగిపోయాయి. గదిలో మళ్ళీ చీకటి....

గదిలో దీపం వెలిగేసరికి కిల్లర్‌కి ఎదురుగా అర్జున్ ఉన్నాడు

"నీ పోలీసులు నన్నేమీ చెయ్యలేరని తెలుసుకున్నావా?" అన్నాడు అర్జున్.

"హేట్సాఫ్ టూయూ .." అన్నాడు కిల్లర్.

"థాంక్యూ-" అని—"నా తెలివితేటలు చూశావు. ఇక నా బలంకూడా చూస్తావా?" అన్నాడు అర్జున్.

"హ్యూర్ —" అంటూ కిల్లర్ మెరుపు వేగంతో అతడిమీదకు ఎగిరాడు.

మొత్తం మనిషిని ఒడిసిపట్టుకొని దూరంగా విసిరేశాడు అర్జున్.

కిల్లర్ ఓ మూలగా పడి వెంటనే లేవలేకపోయాడు. అతడికి కళ్ళు తిరిగాయి.

"లే...." అంటూ అర్జున్ అతణ్ణి సమీపించాడు.

ఇంకా లేవకుండానే కిల్లర్ తలెత్తి అతణ్ణి చూశాడు. అప్పుడు అర్జున్ అతడికి నిజమైన రాక్షసుడిలా అనిపించాడు.

"ఏమిటలా చూస్తున్నావు?" అన్నాడు అర్జున్.

"మొదటిసారి నిన్ను చూసినప్పుడు అందమైన రాక్షసుడిలా కనిపించావు. ఇప్పుడు రాక్షసుడిలా మాత్రమే కన్పిస్తున్నావు. అందంగా లేవు...." అన్నాడు కిల్లర్.

"నీకంటే ఎన్నిరెట్లు బలముందో చెప్పలేను గానీ— బలానికి మించిన చురుకుతనముంది నా దగ్గర. నువ్వింకా కదలాలనుకునేసరికి నేను దెబ్బకు సిద్ధంగా ఉంటాను. నా సాటి వీరుడితో పోరాడాలని నాకు సరదా. నీ గురించి రాజా చెప్పింది విని పోరాడాలని సరదా వేసింది కానీ— నువ్వూ లాభంలేదు...." అన్నాడు అర్జున్.

"నాకూ సరదాగానే ఉంది కానీ...." అంటూ కిల్లర్ ఊహించని విధంగా లేచి అర్జున్ భుజంమీద చేతో విసురు విసిరాడు. అర్జున్ వెల్లకిలా పడిపోయాడు.

కిల్లర్ అతడిమీదకు దూకాడు.

అర్జున్ చేయి జాపి అతడి మెడ పట్టుకున్నాడు గట్టిగా. ఆ పట్టుకు కిల్లర్‌కి ఊపిరి సలపలేదు. గిలగిల తన్నుకోసాగాడు.

"నువ్వు నటిస్తున్నావో, బాధపడుతున్నావో నాకెలా తెలుస్తుంది? రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టు— వదిలేస్తాను...." అన్నాడు అర్జున్.

కిల్లర్ గిలగిల తన్నుకుంటున్నాడు తప్పితే చేతులు జోడించలేదు.

క్రమంగా కిల్లర్ నాలిక బయటకు వచ్చింది. కను గ్రుడ్లు పొడుచుకు రాసాగాయి. అర్జున్ చటుక్కున అతణ్ణి వదిలి పెట్టి— "బాగా— మొండి మనిషి!" అనుకున్నాడు.

కిల్లర్ మామూలు మనిషి కావడానికి చాలా సేపు పట్టింది.

"ఏం మనిషి? ప్రాణంకంటె అభిమానం ఎక్కువా?" అన్నాడు అర్జున్.

"నా ప్రాణంమీద నాకంటే నీకే అభిమానం ఎక్కువగా ఉన్నట్టుంది. నన్ను చంపకుండా వదిలి పెట్టావేం?" అన్నాడు కిల్లర్.

"మృత్యు ముఖంలోంచి బయటపడ్డ అనుభవం ఎలా ఉంటుందో అడిగి తెలుసుకుందామని!" అన్నాడు అర్జున్.

"అది స్వానుభవంలో తప్ప తెలియని విశేషం! ఇంతకీ నా పీక అంత గట్టిగా ఎందుకు నొక్కినట్లు?" ఆ తర్వాత నన్నెందుకు వదిలినట్లు?"

"చేతులు జోడించమన్నాను, జోడించలేదు. అందుకే గట్టిగా పీక నొక్కాను...." అన్నాడు అర్జున్.

"అంత గట్టిగా పీక నొక్కి చేతులు జోడించమంటే నాకేం తెలుస్తుంది. ఆ సమయంలో నాకు ప్రపంచం తెలియలేదు. పంచేంద్రియాలూ వాటి పనులు మానే

కాయి. పోనీలే. అయినా నువ్వు నా ప్రాణం కాపాడావు కాబట్టి ఇప్పుడు చేతులు జోడిస్తాను—" అంటూ కిల్లర్ అతడికి చేతులు జోడించి నమస్కరించి—"నీ తెలివికీ, బలానికి, దయాగుణానికీ—నీకివే జోహార్లు—" అన్నాడు కిల్లర్.

"నాకు జోహార్లర్పించావు. ఇక ముందేం చేస్తావు?"

కిల్లర్ మాట్లాడలేదు.

"నా మాట విని నాతో చేయి కలుపు...."

"అందువల్ల నీకే నష్టం...." అన్నాడు కిల్లర్.

"ఎందుకని?"

"నా దారి వేరు, నీ దారి వేరు. రెండూ కలవవు. కలపాలని నువ్వు ప్రయత్నిస్తే—నీ బలంతో తాత్కాలికంగా నన్ను లొంగదీసుకున్నా—ఎప్పుడైనా నా మనసు చెదిరి నీకు ద్రోహం తలపెడుతుంది...."

"అయితే నేను నిన్నేం చెయ్యాలంటావ్?"

"నన్ను వదిలిపెట్టు. లేదా అంతం చేసేయ్...."

"నిన్ను వదిలిపెడితే నాకు ప్రమాదం కదా!"

"నీకు నా బలం తెలుసు, తెలివి తెలుసు. రెండింట్లో నీకంటే అల్పుడిని. నానుంచి ప్రమాదాన్ని శంకిస్తే నువ్వు నన్ను గౌరవించినట్లు .... నిన్ను కించపర్చుకున్నట్లు....' కదూ?" అన్నాడు కిల్లర్ నవ్వుతూ.

"సవాలు చేస్తున్నావా?" అన్నాడు అర్జున్.

కిల్లర్ నవ్వి—"నీకే తెలుసు!" అన్నాడు.

"అయితే నీకో అవకాశమిస్తున్నాను. ఈ రోజు రాత్రి ప్రముఖ వ్యాపారస్థుడు దశరథరామయ్యగారింట్లో ప్రవేశించి—ఆయన పడకగదిలో రెండు గంటలు గడిపి రావాలి. రాత్రి పదకొండునుంచి ఒంటిగంటవరకూ...."

"ఎందుకని?"

"అలా గడిపివచ్చేక నిన్ను నేను వదిలి పెడతాను.."

"ఒకసారి నన్ను వదిలేక నేను నీకు మళ్ళీ దొరుకు తానా?"

అర్జున్ నవ్వి—"నీకే తెలుసు!" అన్నాడు.

"నువ్వు చెప్పింది నేను సాధిస్తాను...." అన్నాడు కిల్లర్.

తర్వాత గదిలో దీపం ఆరిపోయింది. చీకట్లో అర్జున్ అతణ్ణి ఎత్తుకొని యేవో మెల్లెపుతున్నాడని. గ్రహించాడు కిల్లర్.

7

ముందుగా తన వ్యాన్లోకి వెళ్ళి నేతనను పలకరించి ధైర్యం చెప్పి—తర్వాత దశరధరామయ్యింటికి వెళ్ళాడు కిల్లర్.

సమయానికి దశరథరామయ్య ఇంట్లో లేడు. ఒక ముసలి నౌకరు కిల్లర్కు మర్యాదలు చేసి ఓ గదిలోకి తీసుకొని వెళ్ళాడు. కిల్లర్ ఆ ముసలి నౌకరు వివరాలు తెలుసుకొన్నాడు. అతడన్ని వేళలా యింటినే కనిపెట్టుకొని వుంటాడు. విశ్వాసపాత్రుడు.

"నువ్వెక్కడ పడుకుంటావ్?" అనడిగాడు కిల్లర్.

కిల్లర్ కూర్చున్న గదినానుకొనే ఓ గది వుంది. అదీ ఆ నౌకరు గది. సాధారణంగా ఆ గదిలో కెవ్వరూరారు.

ఇది వింటూనే కిల్లర్ ఆ నౌకరు మెడ వెనుక ఓ దెబ్బ కొట్టాడు. కిమ్మనకుండా అతను పడిపోయాడు. కిల్లర్ అతడి కాళ్ళూ చేతులూ బంధించి—త్వరగా తన వేషం మార్చుకొని గది తలుపులు వేసి బయటకు వచ్చాడు.

చాలా సేపు ఇంట్లో తిరిగి తన కప్పగించిన పనులన్నీ

చేశాడు. రాత్రి ఎనిమిదయ్యాక అతడికింకేమీ పనుండదు.

"పోయి పడుకోరా!" అన్నాడు దశరథరామయ్య. ఆయన ఇంటికి రావడమే రాత్రి ఏడింటికి వచ్చాడు.

"చిత్తం!" అని సెలవు తీసుకున్నాడు కిల్లర్. నౌకరు గదిలోనికి కాస్త ఫలహారం తీసుకొని వెళ్ళాడు. అతడి కట్లు విప్పి స్పృహ తెప్పించాడు.

నౌకరుకు ముందేమీ అర్థంకాలేదు.

"ఫలహారం తిను—" అన్నాడు కిల్లర్.

అది తిన్నాక నౌకరుకు ప్రాణం తెరిపిన పడింది. రాత్రి కళ్ళతడికంత బాగా కనిపించవు.

"ఏమయింది నాకు—నువ్వెవరు?" అన్నాడా నౌకరు.

"కళ్ళు తిరిగి పడిపోయావు. అయ్యగారు నిన్ను రాత్రంతా విశ్రాంతి తీసుకోమన్నారు...." అంటూ కిల్లర్ అతడికి మళ్ళీ స్పృహ తప్పించాడు.

ఆ గదిలోంచి తను బయటకు వచ్చి నెమ్మదిగా ఎవరూ చూడకుండా దశరథరామయ్యింటి పడక గదిలో ప్రవేశించాడు. ఎవరైనా చూసినా అతడినను మానించరు. నౌకరేడీ అని కనుక్కుంటే అతడు తన గదిలో నిద్రపోతూనే ఉంటాడు.

కిల్లర్ దశరాథరామయ్య గదిలో మంచం కింద దూరాడు. సమయంకోసం వేచి ఉన్నాడు.

8

రాత్రి పదకొండు గంటలకు దశరథరామయ్య గదిలో మొత్తం ఆరుగురు సమావేశమయ్యారు. వారిలో దశరథరామయ్య ఉన్నాడు. మిగతా అయిదుగురిలో ఒకడు రాష్ట్రంలో పదవిలో లేని రాజకీయ నాయకుడు, మరొకడు కేంద్ర మంత్రివర్గంలో ఒక ప్రముఖుడి ప్రతినిధి—

అని అర్థమయింది కిల్లర్ కి.

సంభాషణ వింటున్న కిల్లర్ ఉలిక్కిపడ్డాడు.

మద్రాస్ లో ఒక సినీ నటుడి ఇంట్లో ఇన్ కంటాక్స్ రెయిడ్ జరిగింది. ప్రభుత్వానికి తెలియకుండా దాచిన ఆస్తి అరవై లక్షల రూపాయలు బయటపడింది.

విశాఖపట్నంలో స్మగ్లింగ్ కేసులో ప్రముఖ రాజకీయ నాయకుడి హస్తం ఉన్నట్లు ఆధారాలు దొరికాయి.

కాన్పూర్లో స్కూటర్ ఫ్యాక్టరీ పెడతామంటూ ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేస్తోందొక సంస్థ. అది ప్రజలను మోసం చేయడం ఖాయం.

ఇలాంటి అవినీతికర విశేషాలెన్నో వాళ్ళు చర్చిస్తున్నారు. అయితే ఆ అవినీతిపరులకెలా రక్షణ కల్పించాలా అన్నది వారి సంభాషణలో చర్చనీయాంశం.

ప్రజలకన్యాయం జరిగినా ప్రభుత్వంమీద సానుభూతి నశించకూడదు. అవినీతిపరులకు రక్షణ కలిగించినా రూలింగ్ పార్టీపై దుష్ప్రచారం జరక్కూడదు.

అవినీతిపరులు తను దుష్కార్యాలు కొనసాగిస్తూ ప్రభుత్వానికి మద్దతునిస్తూంటారు. ప్రభుత్వం వారికి మద్దతునిస్తూనే ప్రజల్లో మంచి పేరు తెచ్చుకుంటుంది.

కిల్లర్ మొత్తం సంభాషణంతా విన్నాడు. ఎన్నో అమూల్య రహస్యాలతడికి తెలిశాయి.

ఆ గదిలోని సమావేశం రాత్రి ఒంటిగంటకు ముగిసింది.

అంతా బయటకు వెళ్ళేక కిల్లర్ తనూ గదిలోంచి బయటకు వచ్చాడు. కాసేపట్లో అటూ యిటూ పచార్లు చేసి నెమ్మదిగా బంగళాలోంచి బయటపడ్డాడు.

వాచ్ మన్ కూడా అతణ్ణింటి నౌకరుగానే భావించి

అడ్డగించలేదు కాని ఒకసారి—"ఏం ముసలాడా—నిద్ర పట్టడంలేదా?" అని పలకరించాడు.

"నాది నిద్రముఖం. రోజూ రాత్రిళ్ళు నీకు తెలియకుండా బయటకు వస్తూ పోతూనే ఉంటాన్నేను...." అని కిల్లర్ అక్కణ్ణించి బయటపడ్డాడు.

ముందుగా అతడు ఓ సందులోకి వెళ్ళి తన వేషం మార్చుకున్నాడు. మొలలో చుట్టూ దోపుకున్న—పాంటు, షర్టు తీసి బట్టలు మార్చుకున్నాడు. అక్కణ్ణించి తిన్నగా రాజా తనను తీసుకొని వెళ్ళిన యింటికి వెళ్ళాడు.

ఇల్లు ఖాళీగా వుంది. అయితే అతడు చేరిన కాసేపటి కక్కడికి అర్జున్ వచ్చాడు.

"వెళ్ళేవా?" అన్నాడతడు.

"ఊఁ" అన్నాడు కిల్లర్.

"విన్నావా?"

"ఊఁ"

"ఏం తెలుసుకున్నావ్?"

"అవి నీకు చెప్పకూడని రహస్యాలు...."

అర్జున్ నవ్వి—తన జేబులోంచి ఒక పాకెట్ టేపు రికార్డర్ తీసి ఆన్ చేశాడు.

కిల్లర్ అది వింటూ ఉలిక్కిపడ్డాడు. కాసేపటి క్రితం తను విన్న సంభాషణ అది!

"ఇది నీ దగ్గరకెలా వచ్చింది?" అన్నాడతడు ఆశ్చర్యంగా.

"ఎలా వచ్చిందని అడక్కు! ఈ దేశంలో నాకు తెలియని రహస్యాలుండవు...."

"ఎలా తెలిసింది?" అని—"నువ్వు దశరథరాముడి మనిషివా?" అన్నాడు కిల్లర్ ఆలోచనగా.

"దశరథ రామయ్య నా ప్రత్యర్థి...." అన్నాడు అర్జున్.

"అక్కడి విశేషాలు నువ్వు తెలుసుకోగల్గినపుడు— నన్నెందుకు పంపావు?"

"ఎందుకా? నువ్వు నమ్మిన నీతిని, చట్టాన్ని పరిరక్షించడానికి—నువ్వెన్నుకొన్న నాయకులు—తమ బాధ్యతలనే విధంగా నిర్వహిస్తున్నారో తెలుసుకుంటావని!" అన్నాడు అర్జున్.

"నేను తెలుసుకోనడమెందుకు?" అన్నాడు కిల్లర్.

"చూడు బ్రదర్! తలిదండ్రులు తాము కోరినవన్నీ కొని పెట్టాలని పిల్లలనుకొంటారు. ఆ పిల్లలే తలిదండ్రులైనప్పుడు తమ పిల్లలు కోరినవన్నీ కొని పెట్టలేరు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పకుండా, ఊరికే మార్కులిస్తూండాలని విద్యార్థులనుకుంటూంటారు. ఆ విద్యార్థులుపాధ్యాయులైనప్పుడు తామలా చేయలేరు.

కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా సమ్మె చేస్తారు. ఆ కార్మికులకే యాజమాన్యంలో స్థానం లభిస్తే కార్మికుల కోర్కెలను నిరసిస్తారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోస్తాయి. తాము ప్రభుత్వంలోనికి వస్తే ఆ ప్రతిపక్షాలు—ఒకనాటి తమ కోర్కెల గురించి మర్చిపోతాయి .... ఇదంతా ఎందుకు చెబుతున్నానో తెలుసా?" అన్నాడు అర్జున్.

"తెలియదు—నువ్వే చెప్పు—" అన్నాడు కిల్లర్.

"సామాన్య పౌరులు పౌరులుగా ఉన్నప్పుడు కట్టుబడిన నీతి, నిజాయితీ పదవిలో ఉన్నప్పుడు — వారిని ఇబ్బందులకు గురిచేస్తాయి. అందుకని చట్టానికి పరిరక్షకులైన వారే — చట్టవిరుద్ధమైన పనులు ప్రోత్సహించక

తప్పదు. బాధ్యతలు మనిషిని వాస్తవానికి అనుగుణంగా మారుస్తాయి ...."

"ఇదంతా ఎందుకు చెబుతున్నావు?"

"పూర్తిగా విను. కట్నం చట్టవిరుద్ధం. లంచం చట్టవిరుద్ధం. కానీ సామాన్య పౌరులు తమకు వీలుగా ఉన్నందున ఈ విషయాల్లో చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. అలాగే వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, అధికారులు, మంత్రులు—తమ తమ వీలునుబట్టి చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. ఇందులో ఎవరూ దేనికీ ఆవేశపడవలసింది లేదు. నీకు తెలిసిన నిజాయితీపరులు, నీకు తెలిసిన గౌరవనీయులు, నీకు తెలిసిన రాజకీయ నాయకులు—ఏం మాట్లాడుకున్నారో నువ్వే స్వయంగా విన్నావు. అలాంటప్పుడు—నీవంటివారు మావంటి వారికి వ్యతిరేకంగా పని చేయడమెందుకు?" అన్నాడు అర్జున్.

"అయితే ఏం చేయాలంటావ్?"

"మాతో చేతులు కలుపు. నీకు సుఖ జీవనం. మాకో సమర్థుడి అండ...."

"అయాం సారీ మిస్టర్ అర్జున్.... ఎవరో తప్పులు చేస్తున్నారని నేనూ చేయలేను తప్పులు...."

"తప్పులు చేస్తున్నది ఎవరో కాదు.... మోజుపడి ప్రజలెన్నుకొన్న నాయకులు...."

కిల్లర్ నవ్వి—"నాయకులందరూ మోసగాళ్ళు కారు. అంతా మోసగాళ్ళే అయితే దేశమీమాత్రం ముందుకు వెళ్ళేదికాదు. వారిలో కొందరు ప్రజాసేవకులున్నారు. కొందరు దోపిడీదారులున్నారు. వీరిద్దర్నీ బ్యాలన్సు చేసే మధ్యరకం వాళ్ళున్నారు...." అన్నాడు.

"నువ్వు తెలివైనవాడివి. మాటలతో నిన్నొప్పించడం

కష్టం....మా జోలికి రానని మాటిస్తే నిన్ను తప్పక వదిలి పెట్టగలను...." అన్నాడు అర్జున్.

"నన్ను వదలకపోతే మీ పునాదులు కదిలిపోతాయి. అలాంటి యేర్పాట్లన్నీ బయట చేసి వచ్చాను...."

"నీ ఏర్పాట్లకు నేను భయపడను. వాటిని ఛిన్నాభిన్నం చేయగల సమర్థత నాకుంది —" అన్నాడు అర్జున్.

అర్జున్, కిల్లర్ ముఖముఖాలు చూసుకొన్నారు.

"నీకంటే బలవంతుణ్ణి. నా మాట వినకపోతే నిన్ను సర్వనాశనం చేస్తాను...." అంటున్నాయ్ అర్జున్ కళ్ళు.

"నేను నీకు భయపడను. చావుకైనా సిద్ధం...." అంటున్నాయ్ కిల్లర్ కళ్ళు.

"ఇంకెప్పుడూ మా జోలికి రానని మాటివ్వు...." అన్నాడు అర్జున్ మళ్ళీ.

"నిలబెట్టుకోలేని మాట యిచ్చి మాత్రం ఏం ప్రయోజనం?" అన్నాడు కిల్లర్.

"నువ్వు మాటివ్వాలి. అది నిలబెట్టుకోవాలి. ఎందుకంటే అప్పుడే నువ్వు చేతన శంకరంలాంటి వారికి సాయపడగలుగుతావు!" అని...."నువ్వు నా మాట విను. దేశంలో సామాన్యులెందరో ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు వారికి తీయని మాటలు చెబుతారు. చట్టం వారిని న్యాయస్థానాల చుట్టూ తిప్పుతుంది. వారికి నీవంటివారే అండగా ఉండాలి. మాబోటి వారితో వైరం పెట్టుకొని నువ్వు సాధించేదేమీ ఉండదు—సామాన్యులకు దూరంకావడం తప్ప! ఒకవేళ నిజంగానే నువ్వేదైనా సాధించగలిగావా—అప్పుడు దేశపు పునాదులే కదిలిపోతాయి...." అన్నాడు అర్జున్.

కిల్లర్ ఆలోచనలో పడ్డాడు. అర్జున్ చెబుతున్నది

నిజం! దేశం మొత్తంలోని అవినీతి ఎదిరించడం మనవల్ల కాదు. దేశపు పాలకత్వ రథానికి, నీతి, అవినీతి— రెండు చక్రాలై —నడిపిస్తున్నాయి.

"చేతన విషయంలో నీ గెలుపు అంగీకరిస్తాం. మేమిక ఆ అమ్మాయి జోలికి వెళ్ళం. అయితే నువ్వూ ఈ కేసు నిక్కడితో మరిచిపోవాలి...."

"మరి రాజా విషయం!"

"నీ పరిశోధన విజయవంతం అవుతుంది. రాజా పట్టుబడతాడు. అయితే రాజాను నడిపించేవారు వేరే ఉన్నారని ఎవరికీ తెలియకూడదు. కేసు రాజా దగ్గర ఆగిపోవాలి...."

కిల్లర్ నవ్వి-"నిజం చెప్పాలంటే కేసు నీ దగ్గరా ఆగకూడదు .... నిన్నూ నడిపించేవారున్నారని నాకు తెలుసు...." అన్నాడు.

"ఎలా?" అన్నాడు అర్జున్ ఆశ్చర్యంగా.

"భగవంతుడు బలాన్నీ, తెలివినీ ఒకేచోట ఉంచకుండా జాగ్రత్త తీసుకుంటాడు. నీ బలం అసామాన్యం. దానికి నేను తలవంచాను. నీకింత తెలివుందంటే—అది నీదికాదని నేనూహించాను, నా ఊహ తప్పుకాదు...." అన్నాడు కిల్లర్.

"నువ్వసాధ్యుడివి. అయితే నా గురించి ఇంకేమీ ఊహించకు...."

"ఒప్పుకుంటున్నాను. మీరు ప్రస్తుతానికి మత్తు పదార్థాల రవాణా మానెయ్యాలి. చేతన, శంకరం జోలికి వెళ్ళకూడదు...."

"రాజా పట్టుబడగానే మత్తుపదార్థాల రవాణా ఎలాగూ ఆగిపోతుంది. అయితే అది తాత్కాలికం

మాత్రమే!" అన్నాడు అర్జున్.

"మిమ్మల్ని శాశ్వతంగా దారిమళ్ళించే ఉపాయం లేదా?"

"ఉంది—ప్రజల చైతన్యంలో దాగుని వుంది...."

"మిస్టర్ అర్జున్....నువ్వు చెప్పింది నిజం. ప్రజల్లో చైతన్యం కలిగేవరకూ నేను వారికి సాయపడక తప్పదు. నా కేసుకు సంబంధించిన విషయాల్లో తప్ప— నేను మీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోను...." అన్నాడు కిల్లర్.

"ఓకే!"

"కానీ నువ్వు నన్నిలా వదిలి పెడుతున్నావంటే నేను నమ్మలేకున్నాను. నావల్ల ప్రమాదముందని తెలిసీ— నన్నెందుకు వదిలి పెడుతున్నావు?"

"ఈ ప్రపంచాన్ని అవతార పురుషులకంటే ఎక్కువ కాలం హిరణ్యాక్షు, హిరణ్యకశిపులూ, రావణాసురులూ- ఎక్కువకాలం ఏలారు. అయితే వరగర్వంతో మిడిసిపడి అజాగ్రత్తలో ఉన్న కారణంగా వారు సర్వనాశన మయ్యారు. మేములా కాదు. నీ వంటి సమర్థులను మాకు వ్యతిరేకంగా పని చేయనిస్తాం. నీ సమర్థత మా సమర్థతను పెంచుతుంది. నీ ఉనికి మమ్మల్ని అప్రమత్తుల్ని చేస్తుంది. నీ విజయం మాకు హెచ్చరిక అవుతుంది. ఆ విధంగా నువ్వు మా జీవితకాలాన్ని పెంచుతావు...." అన్నాడు అర్జున్.

"ఓ కొత్త విషయం తెలుసుకున్నాను...." అన్నాడు కిల్లర్ ఆశ్చర్యంగా.

"మరో విషయం. నువ్వు మాకో హెచ్చరికవు. నీ ఉనికి మా కవసరం. అయితే పట్టుబడ్డ రాజా—తన మీద ఆరోపించబడిన నేరాల కాధారాలు దొరక్క త్వరలో నే

విడిచిపెట్టబడుతాడు. అప్పుడు నువ్వావేశపడకూడదు."

అన్నాడు అర్జున్.

"మరేం చేయాలి?"

"అది మా నుంచి హెచ్చరికగా నువ్వు భావించాలి!"

కిల్లర్ అక్కణ్ణించి బైటపడ్డాక కూడా ఆ వాక్యమే అతడి చెవుల్లో గింగురుమంటోంది. అతడిప్పుడు ఒకనాటి కిల్లర్ కాదు!

—: అయిపోయింది :—